సాక్షి మహబూబ్‌నగర్

బుధవారం । 20 । డిసెంబర్ । 2023



భూకబ్జాల గుట్టు వీడేనా?

అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్న జడ్చర్లలో భూ కబ్జాలు చోటుచేసుకున్నాయి.

వివరాలు 8లో ▸



రక్తమోడిన రహదారులు

ఉమ్మడి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం పాలయ్యారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.7 /15.4

వాతావరణం

చలి తీవ్రత అధికంగా ఉండడంతోపాటు ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రివేళలో గాలులు వీస్తాయి.

అటకెక్కిన ఐటీఐ విద్య

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా తయారైన ప్రైవేటు ఐటీఐ కళాశాలలు

- మొక్కుబడిగా తరగతులు.. కానరాని అధ్యాపకులు, వసతులు
- ప్రభుత్వానికి ప్రైవేటు కళాశాలల తీరుపై అధికారుల రిపోర్టు
- కొందరు అధికారులు, సంఘం నాయకుల అండదండలతో అడ్డగోలుగా నిర్వహణ
- పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు లేకపోవడంతో ఇష్టారాజ్యం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో ఐటీఐ కళాశాలల పరిస్థితి అధ్వానంగా తయారైంది. కళాశాలల్లో చేరిన విద్యార్థులకు నామమాత్రంగా, మొక్కుబడిగా చదువులు బోధిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కనీసం తరగతి గదులు, ల్యాబ్‌లు, యంత్ర పరికరాలు, వసతులు లేకుండానే నిర్వహిస్తున్నాయి. విద్యార్థులు ఎక్కువగా ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, ప్లంబర్ వంటి కోర్సుల్లో చేరుతున్నారు. అయితే ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పూర్తిస్థాయి నైపుణ్యాలు లేకుండానే బయటికి వస్తున్నారు. యాజమాన్యాలకు రాష్ట్రస్థాయిలో ఉండే సంఘాల నాయకులు, కొందరు ఐటీఐ విద్యాశాఖాధికారుల అండదండలు ఉండడం వల్ల వారు ఏం చేసిన చెల్లిపోతుందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా కళాశాలల్లో ఎలా బోధించినా.. ఎలా నిర్వహించినా అడిగే వారు లేరని థోరణిలో కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో కళాశాలల డొల్లతనం బయటబడింది. దీనిపై ఐటీఐ విద్యాశాఖ అధికారులకు రిపోర్టు పంపించారు. కానీ, వీటిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తుంది. ఉమ్మడి జిల్లాలో 30కిపైగా కళాశాలలు ఉండగా.. 7,500 సీట్లు అందుబాటులో ఉన్నాయి.



మహబూబ్‌నగర్‌లోని ఐటీఐ కళాశాల

తనిఖీల్లో బయటపడ్డ అంశాలు..

- ఉమ్మడి జిల్లాలోని ఐటీఐ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు బోధించేందుకు పాటించాల్సిన కనీస నిబంధనలు పట్టించుకోవడం లేదు. గతంలో అధికారులు చేపట్టిన తనిఖీల్లో కొన్ని అంశాలు బయటపడ్డాయి.
- రికార్డుల్లో 15 నుంచి 20 మంది అధ్యాపకులు, సిబ్బంది ఉన్నట్లు చూపిస్తున్నారు. కానీ, తనిఖీల సమయంలోనే ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే కనిపిస్తున్నారు. ప్రతి కోర్సుకు దాన్ని నిర్వహించే మాస్టర్, బోధించే సిబ్బంది ఇలా ఎవరూ కూడా అందుబాటులో లేరు.
- ఒక ప్రైవేటు కళాశాలలో నాలుగు గ్రూప్‌లకు కలిపి మొత్తం సీట్లు 248 మంది ఉంటే తనిఖీల సమయంలో కేవలం 25 మంది విద్యార్థులు మాత్రమే హాజరైనట్లు అధికారులు తమ మ్యానువల్‌లో చూపించారు. మిగతా విద్యార్థులు ఎక్కడ ఉన్నారు.. ఎప్పుడు కళాశాలకు వస్తారు.. అనే ప్రశ్నలకు సమాధానం లేదు.
- ఐటీఐ విద్యలో థియరీ కన్నా.. ప్రాక్టికల్ తరగతులకు ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. డీజిల్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్, ప్లంబింగ్, ఫిట్టర్‌లకు సంబంధించి విద్యార్థులకు బోధించేందుకు టూల్స్, పరికరాలు అవసరం. కానీ, అన్నిరకాల వసతులు 2, 3 కళాశాలల్లో మినహా మిగతా ఎక్కడా కనిపించవు.
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతులు, మరుగుదొడ్లు, ల్యాబ్‌లు వంటివి ఉన్నట్లు రికార్డుల్లో చూపించినా.. అధికారుల తనిఖీల సమయంలో మాత్రం చాలా అధ్వాన పరిస్థితులు బయటపడుతున్నాయి.
- విద్యార్థులు కళాశాలకు రాకున్నా.. తరగతులు వినకున్నా.. రికార్డులు రాయకున్నా.. నేరుగా డబ్బులు తీసుకుని వార్షిక పరీక్షలకు హాజరయ్యేలా కొందరు ఒప్పందాలు చేసుకుని అడ్మిషన్లు ఇస్తున్నట్లు విద్యార్థి సంఘాల ఆరోపిస్తున్నాయి. ఇందుకోసం డొనేషన్లు, అధిక ఫీజుల వసూలు చేస్తున్నారు.
- ప్రైవేట్ కళాశాలలకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వ ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో తయారు చేసి ప్రభుత్వానికి పంపించినా ఉన్నతాధికారులు వాటిపై చర్యలు తీసుకోకుండా ప్రతి సంవత్సరం సీట్ల భర్తీకి అనుమతులు ఇస్తున్నారు.

ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు

ఉమ్మడి జిల్లాలో ఐటీఐ కళాశాలలను అడ్డగోలుగా నిర్వహించేందుకు సంఘాల నాయకులు, ఐటీఐ విద్యాశాఖ అధికారుల అండదండలు దండిగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక సంఘం నాయకుడు ఏకంగా 8కిపైగా కళాశాలలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో ఈయనకు రాష్ట్రస్థాయి అధికారులతో ఉన్న సంబంధాల కారణంగా ఆయన కళాశాలలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. పలుమార్లు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాళ్ల రిపోర్టులో అంశాలను వివరించిన పట్టించుకోకపోవడంపై ఉన్నతాధికారుల తీరుపై విద్యార్థి సంఘాలు విమర్శలు చేస్తున్నాయి. ఇంటర్, డిగ్రీ మాదిరిగా ఐటీఐ కళాశాలల పర్యవేక్షణకు కూడా ప్రత్యేకాధికారులను నియమించాలని కోరుతున్నారు.

నివేదిక పంపించాం..



సాధారణ తనిఖీల్లో భాగంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రైవేట్ కళాశాలలను తనిఖీ చేస్తాం. ఇందులో ఒకట్రెండు కళాశాలలు మినహా మిగతా ఎక్కడా పూర్తిస్థాయి వసతులు ఉండవు. అధ్యాపకులు, విద్యార్థులు, టూల్స్, పరికరాలు కనిపించవు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, మరుగుదొడ్ల ఊసే లేదు. మాకు ఇచ్చిన మ్యానువల్ ప్రకారం వివరాలను ప్రభుత్వానికి పంపించాం. కానీ, వసతులు లేని కళాశాలలపై చర్యలు తీసుకునే బాధ్యత ఉన్నతాధికారులదే.

– శాంతయ్య, ప్రభుత్వ ఐటీఐ కళాశాల, ప్రిన్సిపల్, మహబూబ్‌నగర్

ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ ఐటీఐ కళాశాలల వివరాలు..

జిల్లా	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	గద్వాల	షాద్‌నగర్	నారాయణపేట	వనపర్తి
కళాశాలలు	8	6	6	4	3	3
సీట్లు	2,384	1,504	1,532	680	776	624

కురుమూర్తి ఆలయ అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యేలను శాలువాలతో సత్కరించిన ఆలయ అర్చకులు

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని దేవరకద్ర, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వంశీకృష్ణ, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అమ్మాపురం సమీపంలోని కురుమూర్తిస్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుమూర్తిస్వామి ఆలయం అత్యంత ప్రాచీనమైనదని, ఇలాంటి ఆలయం ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉండడం మనందరి అదృష్టం అన్నారు. నెలరోజులపాటు అత్యంత వైభవంగా ఉత్సవాలు కొనసాగే జాతర ఉందంటే అది కురుమూర్తి స్వామిదే అన్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి తామంతా కలిసికట్టుగా పనిచేస్తామని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరు కోరుతామన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం స్వామివారి ఆలయానికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని, ఇప్పటికే ఆరు గ్యారంటీలలో రెండు అమలు చేసిందన్నారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నివిధాల అభివృద్ధి పరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

21న 'సృజన టెక్‌ఫెస్ట్-2023'

కోస్గి: విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యతను పెంపొందించడంతో పాటు పరిశోధనలపై ఆసక్తి పెంచాలనే లక్ష్యంతో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 21న 'సృజన టెక్‌ఫెస్ట్-2023' పేరుతో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పరమేశ్వరి, మెకానికల్ విభాగాధిపతి సత్యయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది మెకానికల్ విభాగంలో ఉమ్మడి జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది కోస్గి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్, వనపర్తి, వడ్డేపల్లి, కోస్గి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని.. ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పాలిటెక్నిక్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి కరెంట్ కట్



విద్యుత్ సరఫరా లేక చిమ్మచీకట్లో మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ సరఫరా నిలిపివేశారు. కార్యాలయానికి సంబంధించిన విద్యుత్ బకాయి ఉండటంతో కరెంట్ కట్ చేసినట్లు తెలిసింది. పవర్ కట్ చేసిన తర్వాత కొంత సమయం వరకు బ్యాటరీలతో కార్యాలయంలో అధికారులు కార్యకలాపాలు కొనసాగించారు. ఆ తర్వాత అవి కూడా పని చేయకపోవడంతో కార్యాలయం చీకటిగా మారి పనులకు ఆటంకం వాటిల్లింది. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించేగా వారు ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు ఈ నెల 31లోగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ అధికారి పాండు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు చర్యలు తీసుకుని సకాలంలో విద్యార్థులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్ర హోంమంత్రి రాజీనామా చేయాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: పార్లమెంట్‌పై జరిగిన దాడికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని సీపీఐ జాతీయ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ భద్రత గురించి నిత్యం మాట్లాడే ప్రధాని కట్టుదిట్టమైన భద్రత ఉన్న పార్లమెంట్‌పై దాడి చేస్తే భద్రత వైఫల్యంపై ఎలాంటి చర్యలు లేవన్నారు. పార్లమెంట్‌లో సభ్యులకే భద్రత లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని మండిపడ్డారు. పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టిసారించి పూర్తి చేసేందుకు రూ.వెయ్యి కోట్ల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వాడవాడల ఎర్రజెండాల ఆవిష్కరణ, సభలు, సమావేశాలు నిర్వహించి సంబరాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పరమేశ్‌గౌడ్, బాలకిషన్, సురేష్, రాము, విల్సన్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ప్రగతిశీల వాదులుగా పోరాడాలని, విద్యార్థి నాయకులకు పీడీఎస్‌యూ అండగా ఉంటుందని రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. పీడీఎస్‌యూ జిల్లా జనరల్ కౌన్సిల్ సభల సందర్భంగా మంగళవారం జిల్లాకేంద్రంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మారుతి, ప్రధాన కార్యదర్శిగా సీతారాం, ఉపాధ్యక్షులుగా మధుసూదన్, సహాయ కార్యదర్శిగా సాయికిరణ్, కోశాధికారిగా శివకుమార్‌తోపాటు మరో 8 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యార్థులు చెడుమార్గంలో పోకుండా చైతన్యం చేసి సమసమాజ స్థాపనకు నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ కృషి చేయాలని సూచించారు.

కందులు క్వింటాల్ రూ.8,380

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం కందులకు క్వింటాల్ గరిష్టంగా రూ.8,380, కనిష్టంగా రూ.8,251 ధరలు పలికాయి. అదేవిదంగా ఆముదాలు రూ.5,169, ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యానికి క్వింటాల్ గరిష్టంగా రూ.3,331, కనిష్టంగా రూ.2,009, హంస రకానికి గరిష్టంగా రూ.2,159, కనిష్టంగా రూ.1,889, సోన ధాన్యంకు రూ.2,789, మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,305, కనిష్టంగా రూ.2,290, శ్రీరాం గోల్డ్ ధాన్యం రూ.3,237, వేరుశనగ గరిష్టంగా రూ.8,409, కనిష్టంగా రూ.7,790, రాగులు రూ.3,250 ధరలు లభించాయి.

వరి (సోనా రకం) క్వింటా రూ.3,366

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం వరి (సోనా రకం) క్వింటా గరిష్టంగా రూ.3,366, కనిష్టంగా రూ.2,050 ధర పలికింది. వరి (హంస రకం) గరిష్టంగా రూ.2,720, కనిష్టంగా రూ.1,920, కంది (ఎర్ర రకం) గరిష్టంగా రూ.11,056, కనిష్టంగా రూ.7,438, కంది (తెల్ల రకం) క్వింటా గరిష్టంగా రూ.11,135, కనిష్టంగా రూ.9,822 ధరలు లభించాయి.

క్వింటాల్ వేరుశనగ రూ.7,686

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు మంగళవారం 1301 క్వింటాళ్ల వేరుశనగ రాగా.. గరిష్టంగా రూ.7,686, కనిష్టంగా రూ.3,173, సరాసరి రూ.4,860 ధరలు పలికాయి. 74 క్వింటాళ్ల ఆముదం రాగా.. గరిష్టంగా రూ.5,470, కనిష్టంగా రూ.5,310, సరాసరి రూ.5,460 ధరలు వచ్చాయి. 1157 క్వింటాళ్ల వరి(సోన) రాగా గరిష్టంగా రూ.3,460, కనిష్టంగా రూ.1,467, సరాసరి రూ.2,286 ధరలు పలికాయి. 39 క్వింటాళ్ల వరి(హంస) రాగా.. గరిష్టం, కనిష్టం, సరాసరి రూ.1,410 పలికింది.

ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ జి.రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని కలెక్టర్ రవినాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. ఆసరా పెన్షన్ పొందుతూ మృతి చెందిన కేసులలో భాగస్వామికి పింఛన్ త్వరగా మంజూరు చేయడంపై దృషిపెట్టాలన్నారు. ఈ విషయంలో జెడ్పీసీఈఓ అన్ని మండలాల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించాలని, మున్సిపాలిటీ కమిషనర్లు సైతం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరివికాసం కింద మంజూరు చేసిన బోర్లకు తక్షణమే మోటార్లు బిగించి వారికి ఉపయోగపడేలా చాడాలన్నారు. గతేడాది మాదిరి ఈసారి కూడా అర్హులైన ప్రీమెట్రిక్ విద్యార్థులందరికీ సకాలంలో ఉపకార వేతనాలు అందేలా ప్రత్యేక, సంక్షేమ, విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. అర్హత ఉన్న విద్యార్థుల జాబితాను సమర్పించాలని, అన్ని స్థాయిల్లో ఈ అంశంపై సమీక్షించాలని చెప్పారు. గ్రామ పంచాయతీల్లో విద్యుత్ బిల్లులను నిర్దేశించిన సమయంలో చెల్లించేందుకు జనరేట్ చేసి డీపీఓకు పంపాలన్నారు. గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్‌కు సంబంధించి వివరాలను ప్రతిరోజు తనకు నివేదిక సమర్పించాలని డీఎంహెచ్‌ఓ కృష్ణను ఆదేశించారు. ఈ-ఆఫీస్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని ఫైళ్లను ఎప్పటికప్పుడు ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు, ఆన్‌లైన్ ఎంట్రీలో జాప్యం చేయరాదన్నారు. కాగా జిల్లాలో ఇప్పటివరకు 51,655 మె.ట., ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ చెప్పారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వివరాలను ఆయా మండలాల నుండి తెప్పించాలని సూచించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో అనుమతిలేని లేఅవుట్లు, ప్రజలకు ఉపయోగపడే ఓపెన్ స్థలాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. చెరువు శిఖం భూముల్లో నిర్మాణాలకు ఇరిగేషన్ శాఖ ద్వారా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, డీఆర్‌ఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో ధార్మికతను పెంచడానికే కంఠస్థ పోటీలు



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో రామాచారి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: చిన్నారుల్లో బాల్యం నుంచే ధార్మికత పెంచడానికి ప్రతి ఏటా భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నామని టీటీడీ జిల్లా సహాయకులు డాక్టర్ ఉత్తరాపల్లి రామాచారి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీతను పారాయణం చేయడమే కాకుండా అందులోని సారాంశాన్ని జీవితంలో ఆచరించాలని కోరారు. ఈ పోటీలకు విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన లభించగా 270 మంది హాజరైనట్లు చెప్పారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా చెన్నయ్య, తారకం, భూమానందస్వామి, శ్రీశైలం, రజని, వరలక్ష్మి, రాజేశ్వరి, రాములు, బాలరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ శ్రీపాదరావు, కేశవులు, హన్మంతురెడ్డి, రాములు, చంద్రకళారెడ్డి, సురేష్ చందర్ దూత్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధి పాండురంగం భోజన వసతి కల్పించారు.

విజేతల వివరాలు..

ఈ పోటీల్లో 6, 7 తరగతుల్లో పి.వరలక్ష్మి, టి.గీతాశ్రీ, అక్షిత, 8, 9 తరగతుల విభాగంలో అక్షర, శిరీష, రాజేశ్వరి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో, సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకాల 18 ఏళ్లపైబడి విభాగంలో ఎం.ప్రతిభారాణి, చుక్కాయపల్లి శ్రీదేవి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



డంపింగ్‌యార్డులో డీఆర్‌సీసీ నిర్వాహకురాలితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలో పారిశుద్ధ్యంపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. తెల్లవారుజామున 5.30 నుంచి ఉదయం 7.30 గంటల వరకు టీడీగుట్ట సమీపంలోని కూరగాయల మార్కెట్ పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే హనుమాన్‌పుర, క్లాక్‌టవర్, కొమ్మగేరి, ఆర్ అండ్‌బీ జంక్షన్, రాజేంద్రనగర్, మెట్టుగడ్డ తదితర ప్రాంతాల్లో పర్యటించి పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, పారిశుద్ధ్య కార్మికుల పనితీరు, స్వచ్ఛ ఆటోలపై ఆరాతీశారు. 10.30 గంటలకు కోయిల్‌కొండ ఎక్స్ రోడ్ సమీపంలోని డంపింగ్ యార్డులో సెగ్రిగేషన్ షెడ్, డ్రై-రిసోర్స్ కలెక్షన్ సెంటర్ (డీఆర్‌సీసీ)ని పరిశీలించారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, తరలింపుపై మున్సిపల్ అధికారులు, సిబ్బందికి సూచలిచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రజలు ఓపెన్ ప్లాట్లు, ముఖ్య కూడళ్లలో చెత్తాచెదారం వేయకుండా చూడాలన్నారు. ఇంటింటికీ వెళ్లే స్వచ్ఛ ఆటోలు, మెయిన్ రోడ్‌కు అటు, ఇటు ఉన్న దుకాణ సముదాయాల నుంచి ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, ఎంఈ బస్వరాజ్, డిప్యూటీ ఈఈ బెంజిమన్, ఏఈలు పృథ్వీ, సాయిరాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, వాణికుమారి, హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయం సాధించిన హాకీ బాలికల పాలమూరు జట్టు



చాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న హాకీ బాలుర పాలమూరు జట్టు

హాకీ టోర్నీ విజేత పాలమూరు

- బాలిక, బాలుర విభాగాల్లో సత్తాచాటిన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాలమూరు జట్లు సత్తాచాటాయి. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు బాలకృష్ణయ్య క్రీడా ప్రాంగణంలో జరిగిన అండర్-17 బాలికల పోటీల్లో కరీంనగర్‌పై పాలమూరు విజయం సాధించాయి. బాలుర విభాగంలోనూ నల్లగొండ జట్టుపై పాలమూరు పట్టు ప్రదర్శిస్తూ విజేతగా నిలవడంతో రన్నర్‌గా నల్లగొండ నిలిచింది. హాకీ బాలుర విభాగంలో 3వ స్థానం ఆదిలాబాద్, నాలుగో స్థానంలో కరీంనగర్, హాకీ బాలికల విభాగంలో మూడో స్థానంలో నిజామాబాద్, నాలుగో స్థానంలో ఖమ్మం నిలిచాయి. అండర్- 14 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో విజేతగా నల్లగొండ, రన్నర్‌గా అదిలాబాద్, మూడో స్థానంలో నిజామాబాద్ నిలిచింది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తిరుపతిరావు, డీవైఎస్‌ఓ సుధీర్‌కుమార్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– వనపర్తి టౌన్

క్లుప్తంగా

పోలీసుల కస్టడీలోకి సత్యం యాదవ్

నాగర్‌కర్నూల్ క్రైం: క్షుద్రపూజల పేరిట 11 మందిని హత్య చేసిన రామాటి సత్యనారాయణను సోమవారం రాత్రి న్యాయస్థానం అనుమతితో పోలీసుల కస్టడీకి తీసుకున్నారు. రెండు రోజుల పాటు విచారణలో భాగంగా మంగళవారం రామాటి సత్యనారయణ అలియాస్ సత్యం యాదవ్ నుంచి పలు విషయాలను పోలీసులు సేకరించారు. ఉన్నతాధికారుల సమక్షంలో ప్రత్యేక టీం మున్సిపాలిటీలో ఎండబెట్లతో పాటు వనపట్ల వద్ద సత్యంయాదవ్ చేసిన రెండు హత్యలకు సంబంధించిన సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించి వివరాలు సేకరించారు. విచారణలో మరిన్ని విషయాలు వెలుగు చూసే ఆస్కారం ఉంది. విచారణ కొనసాగుతుందని కొత్త విషయాలు వెలుగులోకి వస్తే ఉన్నతాధికారుల అనుమతితో తెలియజేస్తామని సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

బెక్కం రామలింగేశ్వర ఆలయంలో చోరీ

చిన్నంబావి: మండలంలోని బెక్కం రామలింగేశ్వర స్వామి ఆలయంలో చోరీకి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. బెక్కం గ్రామంలో వారం రోజుల క్రితం రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సమర్పించిన వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు ఎస్ఐ ఓబుల్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పురాతన ఆలయంలో చోరీ కావడం తమ దృష్టికి వచ్చిందని దీనిపై కేసును నమోదు చేసి త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు. మండలంలో ఇటీవల ఇలాంటి ఘటనలు అధికమవుతున్నాయని, వీటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

ఆవుదూడపై చిరుత దాడి

అచ్చంపేట రూరల్: ఆవుదూడపై చిరుత దాడి చేసి చంపిన ఘటన మండలంలోని గుంపన్‌పల్లి శివారులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మూడావత్ లక్ష్మణ్ వ్యవసాయ పొలం వద్ద సోమవారం రాత్రి ఆవుదూడపై చిరుత దాడి చేసి చంపింది. అటవీ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి చిరుత సంచారాన్ని ధ్రువీకరించారు. బోనులు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారుల నుంచి స్పందన లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వారం రోజుల పాటు పొలాల వద్ద ఉన్న పశువులను ఇళ్ల వద్ద ఉంచాలని ఎఫ్ఆర్ఓ రాజేందర్ కోరారు. పాద ముద్రలు పరిశీలించామని, చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

హైనా దాడిలో దూడ మృతి

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన రైతు యాదయ్య ఆవు దూడపై సోమవారం రాత్రి గుర్తు తెలియని అడవి జంతువు దాడి చేయడంతో మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. రోజు వారీగా సోమవారం సాయంత్రం రైతు పాడి ఆవులను పశువుల షెడ్‌లో కట్టేసి వెళ్లాడు. మంగళవారం ఉదయం పాలకోసం వెళ్లడంతో ఆవు దూడ తీవ్రంగా గాయపడి మృతి చెందింది. ఈ విషయంపై పశు వైద్యాధికారులకు, ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. ఆవుదూడపై దాడిచేసిన విధానం, అక్కడ లభించిన కాళ్ల ముద్రల ఆధారంగా హైనా దాడి చేసినట్లు ఫారెస్ట్ అధికారులు పేర్కొన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

కుక్కల దాడిలో జింక..

మహమ్మదాబాద్: కుక్కల దాడిలో జింక మృతి చెందింది. వివరాల్లోకి వెళితే..మండల కేంద్రంలోని కంచన్‌పల్లి శివారులో కస్తూర్బా పాఠశాల వెనకాల శ్రీధర్‌గౌడ్‌కు చెందిన మామిడి తోటలో జంతు కళేబరాన్ని కుక్కలు పీక్కుతిన్నాయి. గమనించిన వారు మొదటగా దాన్ని గొర్రె పిల్లగా అనుమానించారు. దగ్గరికి వెళ్లి చూసి జింకను పోలి ఉండడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. డిప్యూటీ రేంజ్ అధికారి తాజోద్దీన్, సెక్షన్ అధికారి సురేందర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అది జింక జాతికి చెందిన చౌసింగ్‌గా గుర్తించారు. అప్పటికే కుక్కలు సగం పీక్కుతిన్నాయి. మిగిలిన కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహమ్మదాబాద్ అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. బుధవారం పశువైద్యాధికారిచే పోస్టుమార్టం నిర్వహిస్తామని రేంజ్ అధికారి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం పూడ్చిపెట్టనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిజాయితీ

కొల్లాపూర్: ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్లు నిజాయితీని చాటుకున్నారు. ఈనెల 17వ తేదీన కొల్లాపూర్ నుంచి తిరుపతికి వెళ్లే డీలక్స్ బస్సులో అనంతపురం జిల్లా కదిరికి చెందిన రెడ్డినాథ్, లక్ష్మీదేవి దంపతులు ప్రయాణించారు. కర్నూల్‌లో వారు దిగారు. లక్ష్మీదేవి తన హ్యాండ్‌బ్యాగ్‌ను బస్సులోనే మర్చిపోయింది. అందులో తులంన్నర బంగారు గొలుసు, స్మార్ట్‌ఫోన్, రూ.5,100 నగదు, తదితర వస్తువులు ఉన్నాయి. గుర్తించిన దంపతులు ఏడీసీ ఖాజామైనోద్దీన్‌ను వారు ఫోన్లో సంప్రదించి వివరించారు. వెంటనే ఆయన బస్సు డ్రైవర్లను అప్రమత్తం చేశారు. వారు హ్యాండ్ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకొని, కొల్లాపూర్ డిపోలో అందజేశారు. మంగళవారం హ్యాండ్ బ్యాగును బాధితులకు అందజేశారు.

భూ కబ్జాల గుట్టు వీడేనా?



మాచారం శివారులో ఆందోళన చేస్తున్న బాధితులు (ఫైల్)



బాధితుల పక్షాన ఆందోళన చేస్తున్న అనిరుధ్‌రెడ్డి (ఫైల్)

- బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్
- భూ ఆక్రమణలపై నిగ్గు తేలుస్తామంటున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: ఓవైపు 44వ నంబర్ జాతీయ రహదారి మరో వైపు 167 నంబర్ జాతీయరహదారి, ఇతర అంతర్రాష్ట్ర రహదారులు, రైల్వే డబ్లింగ్ లైన్ సౌకర్యాలతో పాటు పోలేపల్లి సెజ్ తదితర పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య రంగాలలో దూసుకుపోతున్న నియోజకవర్గంలో భూ కబ్జాలు అనేకం చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేట్‌గా కొనుగోలు చేసిన ప్లాట్లు, ఇతర భూములను సైతం గతంలో ఆక్రమించుకున్న ఘటనలు ఉన్నాయి. అప్పట్లో అధికారులు సైతం అక్రమార్కులకు వంత పాడడంతో బాధితులు మిన్నకుండిపోయిన పరిస్థితి ఉంది. ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో భూ బాధితుల ఆశలకు ఊపిరి పోసినట్లయ్యింది. దీంతో గతంలో వివిధ కారణాలుగా కోల్పోయిన భూములు, ప్లాట్లు తమకు దక్కుతాయన్న ధీమాతో ఎదురు చూస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సైతం గతంలో ఆక్రమణకు గురైన భూములను గుర్తించి బాధితుల పక్షాన నిలబడుతామని చెప్పడంతో అక్రమార్కులలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఆక్రమిత భూములపై కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేసే విధంగా వ్యూహాలకు పదును పెడుతున్నారు.

ఆక్రమణ గుప్పిట్లో భూములు, ప్లాట్లు

ప్రభుత్వ భూములతో పాటు వివాదంలో ఉన్న భూములు, ప్లాట్లపై భూ బకాసురుల దృష్టి సారించి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. రికార్డులు, ఇతర దస్తావేజులలో గల లొసుగులను ఆధారం చేసుకుని భూ మాఫియా చెలరేగిపోయింది. కోర్టుల్లో కేసులు, వివాహాలు తదితర ఇబ్బందులు సృష్టిస్తూ నీకింతా.. నాకింతా అంటూ సెటిల్‌మెంట్లతో రూ.లక్షలు, కోట్లు గడించేసిన ఘటనలు ఉన్నాయి. పట్టణంతో పాటుగా చుట్టుముట్టు ప్రాంతాలలో గల ఊర్కొండ, రాజాపూర్, బాలానగర్ మండలాల్లో సైతం భూ బకాసురులు చెలరేగిపోయారు. రాత్రికి రాత్రి తారుమారు చేసి ప్లాట్లు, భూములు ఆక్రమించిన పరిస్థితి ఉంది.

నక్కలబండ తండా సమీపంలో..

ఇటీవల నక్కల బండ తండా సమీపంలో 102/18లో గల రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించేందుకు చదును చేసే పనులు చేపట్టాడు. దీంతో తండావాసులు తిరగబడి స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

యువ నేత కనుసన్నల్లో..

మున్సిపాలిటీలోని కొందరు నాయకులతో పాటుగా నియోజకవర్గంలోని ఓ పార్టీకి చెందిన యువనేత కనుసన్నల్లో లింకులు, లిటికేషన్లు ఉన్న భూములు, ప్లాట్లు కొనుగోళ్లు అవుతున్నాయి. పట్టణంలో ఓ ముఠాను తయారు చేసుకుని పెట్టుబడులు పెట్టి రూ.కోట్లు అక్రమంగా ఆర్జిస్తున్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి.

రికార్డుల మాయాజాలం

రెవెన్యూ రికార్డులు, ఇతర సర్వే కొలతలలో లొసుగులు ఆధారం చేసుకుని ఆక్రమణలకు భూ మాఫియా తెరలేపుతుంది. యజమానుల నుంచి భూములను కొనుగోలు చేసిన రియల్ వ్యాపారులు తదుపరి రికార్డులలో తమ పేరున పట్టామార్పిడి చేసుకోకుండా నేరుగా వెంచర్లను ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించారు. అయితే ప్రభుత్వం ధరణిని అమలులోకి తేవడంతో గతంలో వెంచర్లు చేసి ప్లాట్లు విక్రయించినా మళ్లీ ధరణిలో మొదటి పట్టాదారుల పేర్లు రావడంతో అక్రమాలకు తావిచ్చినట్లయ్యింది. తమ తాతలు, తండ్రులు అమ్మిన భూములపై తిరిగి వారసులు తిరగబడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

వెలుగులోకి తేవాలి



నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, దేవాలయ భూములు ఆక్రమణకు గురయ్యాయి. లేఅవుట్‌లలో వదలిన పది శాతం స్థలాలు సైతం కానరాకుండా పోయాయి. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి భూ అక్రమాలపై న్యాయ విచారణ చేసి బాధ్యులపై చర్యలు చేపట్టాలి.

– అనిల్‌కుమార్, సామాజిక వేత్త, జడ్చర్ల

భూ అక్రమాలను విచారిస్తాం



నియోజకవర్గంలో చేసి భూఅక్రమాలను విచారించి చర్యలు చేపడుతాం. బాలానగర్‌లో దాదాపు 27 ఎకరాలకు సంబంధించి అవకతవకలు చోటు చేసుకున్నాయి. ఊర్కొండ, జడ్చర్ల మండలాల్లో ప్రభుత్వ భూములు మాయమయ్యాయి. బూరెడ్డిపల్లి శివారులో గల ఓ వెంచర్‌లో అక్రమాలు జరిగాయి. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేసి అక్రమాలను ప్రజల ముందుంచుతాం.

– అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

కొన్ని ఘటనలు ఇలా..

జడ్చర్ల–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిని అనుసరించి ఉన్న దాదాపు 30–40 ఎకరాల భూమిలో ఏర్పాటు చేసిన వెంచర్లలో దాదాపు 20 సంవత్సరాల క్రితం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ప్లాట్లు కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఆ ప్లాట్లు కబ్జాదారుల చేతుల్లోకి మారాయి. తమ చేతుల్లో రిజిస్ట్రేషన్ దస్తావేజులు ఉన్నా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందని బాధితులు వాపోతున్నారు. కొందరు రూ.లక్ష, రూ.2లక్షలు తీసుకుని తమ ప్లాట్లను కబ్జాదారుల చేతుల్లో పెట్టి పోగా, మరికొందరు తమ ప్లాట్ల కోసం అధికారులు, పాలకులు, ప్రతిపక్ష పార్టీల చుట్టూ తిరుగుతున్నారు. అదేవిధంగా 44వ నంబర్ జాతీయరహదారిని అనుసరించి కొత్త బస్టాండ్ సమీపంలో గల ప్లాట్లను కొందరు దౌర్జన్యంగా ఆక్రమించి కొత్తగా వెంచర్ ఏర్పాటు చేశారు. దీంతో ఇరువర్గాలు సిట్టింగ్‌లు చేసుకుని రాజీకి వచ్చారు. అయితే ఈ వెంచర్‌లో మున్సిపాలిటీకి సంబంధించిన 10 శాతం స్థలం మాయమైంది. అదేవిదంగా కొన్ని నెలల కిందట స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వెనుక ప్రాంతంలో దశాబ్దం కిందట కొనుగోలు చేసిన ప్లాట్లు తమవంటూ కొందరు హైదరాబాద్, మహబూబ్‌నగర్‌లకు చెందిన భూ మాఫియా ముఠాలు భీబత్సం సృష్టించారు. ఎలాంటి కాగితాలు చూపించకుండానే ఆయ ప్లాట్లు, భూమి తమదంటూ జేసీబీతో అక్కడ ఉన్న కట్టడాలను కూల్చి వేసి ఆక్రమించే యత్నం చేశారు. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఎదురు తిరగడంతో వెనక్కి తగ్గారు. ఇక కావేరమ్మపేట, మాచారం శివార్లలో గల వెంచర్లలో అమ్మిన ప్లాట్లను సైతం ఆక్రమించి వ్యవసాయ భూమిగా తిరిగి రిజిస్ట్రేషన్ చేసి మళ్లీ ప్లాట్లుగా విక్రయించిన ఘటనలు ఉన్నాయి.

రక్తమోడిన రహదారులు

- డీసీఎం ఢీకొని ఇద్దరు యువకులు మృతి
- మరొకరి పరిస్థితి విషమం



శివ (ఫైల్)



రాంబాబు(ఫైల్)

పాన్‌గల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన సోమవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. హెచ్‌సీ రాంచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దావాజిపల్లికి చెందిన గడ్డం శివ(19), గడ్డం రాంబాబు(22), శ్రీకాంత్ ద్విచక్ర వాహనంపై పాన్‌గల్‌కు వెళ్తున్న క్రమంలో అన్నారంతండా సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా కోళ్ల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వాహనం అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో శివ అక్కడికక్కడే మృతిచెందగా మిగిలిన ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాంబాబును మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. శ్రీకాంత్‌ను హైదరాబాదు ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. శ్రీకాంత్ పరిస్థితి కూడా విషమంగానే ఉంది. ఇద్దరి యువకుల మృతదేహాలను జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు హెచ్‌సీ తెలిపారు.

ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొని ఒకరు మృతి

మక్తల్: ఆగి ఉన్న లారీని ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఊట్కూర్ మండలం పులిమామిడికి చెందిన కుర్మయ్య(50) సురేందర్ కలిసి మాగనూర్‌లో తన బంధువుల ఇంటికి వెళ్లారు. రాత్రి తమ అవసరాల నిమిత్తం బైక్‌పై మక్తల్‌కు వెళ్లి, తిరిగి మాగనూర్‌కు వెళ్లే క్రమంలో దాబా వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. దీంతో కుర్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సురేందర్‌కు తీవ్రంగా గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు.

రోడ్డు దాటుతుండగా..



జయప్రకాష్ (ఫైల్)

కల్వకుర్తి టౌన్: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాలిలా.. పట్టణంలోని జేపీనగర్‌తండాకు చెందిన జయప్రకాష్ (30) ఇంట్లోకి కర్రీస్ తీసుకోవడానికి అక్కడే ఉన్న దాబాల వద్దకు రాత్రి వచ్చాడు. వాటిని తీసుకుని ఇంటికి తిరిగి వెళ్తున్న అతన్ని మహారాష్ట్రకు చెందిన కారు జయప్రకాష్‌ను ఢీకొట్టింది. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లుగా ఎస్ఐ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జడ్చర్ల: మండలంలోని కిష్టంపల్లి స్టేజి వద్ద నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న అబ్రమోని లక్ష్మయ్య (54) మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలియజేశారు. బూర్గుపల్లికి చెందిన లక్ష్మయ్య ఈనెల 16న ఎక్సెల్ వాహనంపై జడ్చర్లకు వచ్చి తిరుగు ప్రయాణంలో కిష్టంపల్లి స్టేజి వద్ద ప్రమాదవశాత్తు కిందపడి గాయపడగా జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రి, 17వ తేదీన గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ చెప్పారు. కుమారుడు శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఇరువురికి గాయాలు

మండలంలోని పోలేపల్లి ఫార్మాసెజ్ థర్మకేబుల్ కంపెనీలో పనిచేసే రాజ్‌కమల్ శర్మ, పీయూష్‌కుమార్ మధ్య మంగళవారం చోటు చేసుకున్న ఘర్షణలో ఇరువురికి గాయాలైనట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలియజేశారు. కేబుల్ జాయింట్ సమయంలో ఇరువురి మధ్య వాగ్వాదం నెలకొని ఘర్షణకు కారణమైందని, ఇరువురికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మండలంలోని మల్లెబోయిన్‌పల్లి స్టేజి వద్ద కారు ఆటోను ఢీకొట్టిన ఘటనలో నలుగురికి గాయాలైనట్లు ఎస్ఐ తెలిపారు. జాతీయ రహదారిపై నుంచి ఆటోలో పోచమ్మగడ్డతండాకు వెళ్లేందుకు మల్లెబోయిన్‌పల్లి స్టేజి వద్దకు రాగా కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతివేగంతో ఆటోను ఢీకొట్టింది. ఘటనలో దంపతులు దేవుల, లాలి, వారి కూతురు సింధు, కారులో ఉన్న రాములు గాయపడ్డారు. వీరిలో సింధు అపస్మారక స్థితిలో ఉందని ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి

ధన్వాడ: మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం నుంచి నారాయణపేట వెళ్తున్న నారాయణపేట డిపో ఆర్టీసీ బస్సు లింగంపల్లి నుంచి ధన్వాడ వైపు నడుచుకుంటూ వస్తున్న ధన్వాడకు చెందిన జైనబీ(81) ను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

పాఠశాల సమీపంలో మద్యం దుకాణం

- ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయులు

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన వైన్ షాపుతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని హెచ్‌ఎం, విద్యార్థి సంఘాల నాయకులు వేర్వేరుగా జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో పాటు ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాలపై అసిస్టెంట్ ఈఎస్ సుధాకర్ విచారణ చేశారు. వైన్‌షాపు, పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు హన్మంత్‌రెడ్డి, శ్రీనివాసమూర్తితో మాట్లాడి ఫిర్యాదు గల కారణాలను తెలుసుకున్నారు. పాఠశాల సమీపంలో వైన్ షాపు ఉండటంతో విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతుందని తెలిపారు. వైన్ షాపును అనుసరించి ఇళ్లు లేకపోవడంతో పాఠశాల ప్రహరీలోనే మద్యం సేవించే పరిస్థితి ఏర్పడిందని వారు వివరించారు. పాఠశాల గేట్ సమీపంలో పడి ఉన్న ఖాళీ మద్యం బాటిళ్లను ఆయన అధికారికి చూపించారు. అదేవిధంగా పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం 7 గంటల వరకు వరకు క్లాసులు నిర్వహిస్తుండటంతో వైన్ షాపు, మద్యం ప్రియులు పాఠశాల పరిసర ప్రాంతంలో సంచరిస్తుండటం విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారని వారు వివరించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఇక్కడి పరిస్థితిని తమ ఉన్నతాధికారికి నివేదిస్తామని ఏఈఎస్ తెలిపారు. ఎక్సైజ్ సీఐ జనార్దన్, ఎస్ఐ బాలవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

కబడ్డీ విజేతలు గద్వాల, నారాయణపేట జట్లు



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధికారులు

బిజినేపల్లి: ఉమ్మడి జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలలో గద్వాల జట్టు బాలికల విభాగంలో విజేతగా నిలవగా, బాలుర విభాగంలో నారాయణపేట జిల్లా జట్టు విజేతలుగా నిలిచారు. మంగళవారం మండల కేంద్రంలోని మాస్టర్ మైండ్ పాఠశాల ఆవరణలో ఉమ్మడి జిల్లా అండర్–17 కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు ట్రోఫిలు అందజేసి వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన బాలబాలికలు పోటీల్లో పాల్గొన్నారు. బాలబాలికల పోటీల్లో రెండవ స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా విద్యార్థులు నిలిచారు. ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమైన పోటీలు రాత్రి వరకు కొనసాగాయి. బాలుర విభాగంలో నారాయణపేట, నాగర్‌కర్నూల్ జట్లు ఫైనల్‌లో తలపడగ, బాలికల విభాగంలో గద్వాల, నాగర్‌కర్నూల్ జట్లు తలపడ్డాయి. ఈ నెల 23వ తేదీన హనుమకొండలో రాష్ట్రస్థాయిలో పోటీలు జరగనున్నాయని, ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పాండు మంగళవారం వివరించారు. జిల్లా క్రీడల అధికారి సీతారాం నాయక్, ఎస్‌పీసీ కార్యదర్శి ప్రసాద్‌గౌడు, యాదయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు నిరంజన్, రమేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కుటుంబాలకు అండగా ఉంటాం

- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి



ఆర్థికసాయం అందిస్తున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

అచ్చంపేట రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని, మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు అండగా ఉంటామని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవల మరణించిన ఉపాధ్యాయుడు సతీష్ కుటుంబసభ్యులకు మంగళవారం అచ్చంపేటలో రూ. 1,57,500 అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు, పీఆర్‌టీయూ సంఘం క్రియాశీలక సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఉపాధ్యాయుడు సతీష్ మృతి దురదృష్టకరమన్నారు. సంఘ క్రియాశీల సభ్యుడు ఏదైనా కారణంచేత అకాల మరణం చెందితే వారి కుటుంబాలను ఆదుకోవాలనే సంకల్పంతో సంఘం తరుపున రూ.లక్ష అందించి అండగా నిలబడాలని నిర్ణయించామన్నారు. సంఘం ఉపాధ్యాయుల సమస్యల మీద పోరాటం చేయడమే కాకుండా సభ్యులను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. అలాగే వంగూరు మండల పీఆర్‌టీయూ నాయకులు రూ. 57,500 జమ చేసి అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు రామచందర్‌రావు, సత్యనారాయణరెడ్డి, బీచ్యానాయక్, లాల్‌సింగ్, ప్రవీణ్‌రెడ్డి, మల్లయ్య, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం



ఆత్మకూర్: ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమై రూ.లక్ష నష్టం చేకూరింది. పట్టణంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న పాడిరైతు లక్ష్మారెడ్డి తన పశువుల కోసం రూ.లక్ష వెచ్చించి పశుగ్రాసాన్ని కొనుగోలు చేసి రెండు గడ్డివాములు ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు ఎగసిపడడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అప్పటికే పశుగ్రాసం పూర్తిగా అగ్నికి ఆహుతయ్యింది. కావాలనే నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాడు.

అగ్నికి ఆహుతైన పత్తి

మానవపాడు: మండల కేంద్రంలోని రైతు రెహమాన్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో దాదాపు 42 క్వింటాల పత్తి అగ్నికి ఆహుతైనట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం రాత్రి రహెమాన్ ఇంట్లో 8 ఎకరాలలో సాగైన పంటను నిల్వ చేసినట్లు తెలిపారు. నిప్పులు చెలరేగడంతో అలంపూర్‌చౌరస్తాలోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరి మంటలను అదుపు చేసినట్లు ఫైర్ హెడ్‌కానిస్టేబుల్ కురుమూర్తి తెలిపారు. దాదాపు రూ.2లక్షలకు పైగా నష్టపోయినట్లు రైతు తెలిపారు.

బాలికను వేధించిన వ్యక్తికి రిమాండ్

జడ్చర్ల: మైనర్ బాలికను వేధించిన కేసులో భూత్పూర్ మండలం తాటిపర్తికి చెందిన ఎరుకల శివకుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ చంద్రమోహన్ మంగళవారం తెలిపారు. అమ్మాయిలపై వేధింపులకు పాల్పడితే కేసులు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

బీచుపల్లిలో పురావస్తుశాఖ అధికారులు



బీచుపల్లిలో పురాతన విగ్రహాలను పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి కృష్ణానది పుష్కరఘాట్‌ను మంగళవారం కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణానదిలో ఎన్నో దశాబ్దాలకు చెందిన వందల సంఖ్యలో పురాతన విగ్రహాలు ఉన్నాయని ఇటీవల ఓ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీంతో విషయం తెలుసుకున్న కేంద్ర పురావస్తుశాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రోహిణి, రాష్ట్ర పురావస్తుశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములునాయక్ అధికారులతో కలిసి కృష్ణానదిలో ఉన్న దాదాపు 200లకు పైగా 13వ శతాబ్దానికి చెందిన పాడైపోయిన విగ్రహాలను గుర్తించి బయటికి తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కృష్ణానదిలో గుర్తించిన పురాతన విగ్రహాలు అన్నీ కూడా చుట్టు పక్కల ప్రాంతాల్లోని ఆయా ఆలయాల్లో పాడైపోయి పూజకు పనికి రాకుండా ఉండటంతో నీటి ప్రవాహం ఉన్న నదులలో అర్చకుల ఆదేశాల మేరకు పారేస్తుంటారని తెలిపారు. దశాబ్దాల కాలం నుంచి పడేసిన విగ్రహాలే నదిలో అధికంగా ఉన్నాయన్నారు. ఈ ఏట నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో నీటిలో వేసిన విగ్రహాలన్ని బయటపడ్డాయన్నారు. అన్నింటిని కూడా అలంపూర్‌లోని పురావస్తుశాఖ మ్యూజియంకు తరలించనున్నట్లు వారు పేర్కొన్నారు. పురావస్తుశాఖ అధికారులు నారాయణ, నాగరాజు, ఎంపీఓ భాస్కర్, ఆర్ఐ సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.



సోమశిల సమీపంలో పులి సంచారం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల సమీపంలో ఉన్న అడవిలో పులి సంచరిస్తున్నట్లు నిఘా కెమెరాలో తేలిందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్టు రేంజర్ శరత్ చంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల అమరగిరి వద్ద కృష్ణానది నుంచి దాటిన పులి సోమశిల ఏకో పార్క్ పరిసరాలలో సంచరిస్తున్నట్లు తెలిసిందన్నారు. ప్రజలు అడవిలోకి ఒంటరిగా వెళ్లొద్దని హెచ్చరించారు. రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లకూడదని తెలిపారు.

ఎస్సీ హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న ఎస్సీ కళాశాల హాస్టల్ వార్డెన్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్సీ సంక్షేమశాఖ అధికారి పాండుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సోమవారం రాత్రి అన్నంలో వచ్చిన పురుగులు, వెంట్రుకలకు సంబంధించిన ఫొటోలను డీడీకి చూపించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ హాస్టల్‌లో ఉన్న విద్యార్థులకు వార్డెన్లు సరిగా భోజనం పెట్టడం లేదని, ప్రతి రోజు అన్నంలో పురుగులు, వెంట్రుకలు వస్తున్నాయని వార్డెన్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సోమవారం రాత్రి కూడా అన్నంలో పురుగులు, వెంట్రుకలు వచ్చినందుకు విద్యార్థులు చాలా మంది అన్నం తినకుండా ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న వార్డెన్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనాథ్, దస్తప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.